# భీంపూర్‌లోనే కేజీబీవీ

- బీఆర్ఎస్ హయాంలో మంజూరు
- ప్రైవేట్‌కు ధీటుగా ప్రచారం

భీంపూర్, జూన్ 1 : ఆదిలాబాద్ జిల్లా భీంపూర్‌లోనే కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ఇకపై స్థానికంగానే విద్యాబుద్ధులు అందించనుంది. ఇప్పటి వరకు ఆదిలాబాద్‌లోని పాఠశాలలో సాగిన విద్య, భవన నిర్మాణాల అనంతరం భీంపూర్‌లోనే కొనసాగనుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేజీబీవీ నిర్మాణానికి రూ.3.5 కోట్లు మంజూరు కాగా, 2021 జూలై 2వ తేదీన అప్పటి ప్రజాప్రతినిధులు చేతుల మీదుగా భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ప్రస్తుతం భవన నిర్మాణం పూర్తయి ఆరు నుంచి ఇంటర్మీడియట్ వరకు 250 మంది బాలికలు చదువుతున్నారు. అవసరమైన బోధన సిబ్బంది అందుబాటులో ఉన్నారు. ఈ విద్యాసంవత్సరం జూన్ 12 నుంచి భీంపూర్‌లోనే తరగతులు ప్రారంభం కానున్నాయి. పాఠశాల ప్రారంభంతో మారుమూల గ్రామాల పేద, మధ్యతరగతి కుటుంబాల బాలికలకు గుణాత్మక విద్య అందే అవకాశం ఉంది. ప్రైవేట్ పాఠశాలల స్థాయిలో విద్యాసదుపాయాలు కల్పిస్తున్న విషయాన్ని ఎస్‌వో రజని ఆన్‌లైన్‌లో రూపొందించిన కరపత్రం ద్వారా గ్రామగ్రామాన ప్రచారం చేస్తున్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్యావకాశాలను వినియోగించుకోవాలంటూ తల్లిదండ్రులను చైతన్య పరుస్తున్నారు.

### స్థానికుల సంతృప్తి



ఇప్పటి వరకు భవనం లేని కారణంగా మా మండలానికి చెందిన బాలికలు ఆదిలాబాద్‌కు వెళ్లి చదివేవారు. తల్లిదండ్రులకు మళ్లీ మళ్లీ పిల్లలను చూసేందుకు వెళ్లడం చాలా కష్టంగా ఉండేది. ఇప్పుడు గుబిడి, కొజ్జన్‌గూడ సరిహద్దు గ్రామాల నుంచి భీంపూర్ వరకు కూడా తక్కువ దూరంలో పిల్లలను చూసుకునే అవకాశం లభిస్తోంది. ఈ విద్యాలయ నిర్మాణం బీఆర్ఎస్ హయాంలోనే ప్రారంభమైంది.

**- మడావి లింబాజీ, మాజీ సర్పంచ్, భీంపూర్**

### సంరక్షణ , ఉత్తమ బోధన



వసతులు, భద్రతతో పాటు నాణ్యమైన బోధన అందించేందుకు తగిన చర్యలు తీసుకున్నాం. ప్రైవేట్‌కు ధీటుగా ఉండే విధంగా మా కేజీబీవీని తీర్చిదిద్దుతున్నాం. తల్లిదండ్రులు అనవసరంగా అప్పులు చేసి ప్రైవేట్ వైపు మళ్లకుండా ప్రభుత్వ విద్యను సద్వినియోగం చేసుకోవాలి.

**- రజని, ఎస్‌వో, కేజీబీవీ, భీంపూర్**



భీంపూర్‌లో నిర్మించిన కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం

# ప్రయాణ కష్టాలు తీరేదెన్నడో..

- అసంపూర్తిగా రెంకొనివాగు బ్రిడ్జి పనులు
- మంచిర్యాల, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు

ఖానాపూర్, జూన్ 1 : వర్షాకాలం ప్రారంభమవుతుండడంతో రెంకొనివాగు మార్గంలో ప్రయాణాలు మరోసారి క్లిష్టతరమవుతున్నాయి. నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణ శివారులో నూతనంగా నిర్మిస్తున్న రెంకొనివాగు బ్రిడ్జి పనులు ఇప్పటికీ అంపూర్ణంగానే ఉండడంతో, వరదలు వస్తే అప్రోచ్ రోడ్డు పూర్తిగా తెగిపోతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం రూ. 5.20 కోట్ల నిధులు మంజూరు చేసి ఏండ్లు గడిచిన పనులు పూర్తి కాకపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మోస్తరు వర్షాలకే ఇప్పటికే అప్రోచ్ రోడ్డులో రెండు చోట్ల భారీ ఇరుకులు ఏర్పడ్డాయి. వర్షాలు మరింత పెరిగితే ఈ మార్గం పూర్తిగా నిలిచిపోతుందని వారు చెబుతున్నారు. నిర్మల్, మంచిర్యాల, ఆదిలాబాద్ జిల్లాల వాహనాలు ఈ రహదారిలో నిత్యం రాకపోకలు సాగిస్తాయి. కానీ గత వానకాలంలో ఎదురైన ప్రయాణ ఇబ్బందులు ఈ ఏడాది మళ్లీ తెరపైకి రావడంతో ప్రజలు కాంట్రాక్టర్, పాలకుల తీరుపై మండిపడుతున్నారు. ఇప్పటికే బ్రిడ్జి నిర్మాణం 75 శాతం పూర్తయినప్పటికీ బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్ పనులు నిలిపివేసినట్లు తెలుపుతున్నాడు.



గాంధీనగర్ రెంకొని వాగు వద్ద గతేడాది భారీ వరదకు కోతకు గురైన తాత్కాలిక రోడ్డు (ఫైల్)



వాగులో నుంచి వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, ప్రజలు (ఫైల్)

### ప్రయాణ కష్టాలు తప్పడం లేదు



వానకాలం రాగానే అప్రోచ్‌రోడ్డు భయంకరంగా మారి గుంతలు పడుతున్నాయి. దీంతో వాహన రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇక వర్షాలు ఎక్కువగా కురిస్తే వరద ఉధృతికి తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోయి ఈ మార్గం గుండా రవాణా సౌకర్యం పూర్తిగా నిలిచిపోతుంది. రాత్రి సమయంలో అత్యవసర వైద్యానికి ఇబ్బంది పడాల్సి వస్తున్నది. గతంలో బ్రిడ్జి లేకపోవడంతో కష్టాలు పడ్డాం. ఇప్పుడు బ్రిడ్జి పూర్తికాక అవస్థలు పడుతున్నాం. ప్రభుత్వం స్పందించి బ్రిడ్జి పనులు పూర్తి చేసి రాకపోకలు సాగేలా చర్యలు తీసుకోవాలి.

**-బొరువొంతుల నగేశ్, వాహనదారుడు, తర్లపాడు**

## నేడు ప్రజావాణి రద్దు

నిర్మల్ అర్బన్, జూన్ 1 : తెంలగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల సందర్భంగా నిర్మల్ కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి సహకరించాలని వచ్చే సోమవారం నుంచి ప్రజావాణి కార్యక్రమం యథావిదిగా కొనసాగుతుందని తెలిపారు.

ఎదులాపురం, జూన్ 1: ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి ఈ నెల 2వ తేదీన రద్దు చేసినట్లు ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రజావాణి వాయిదా వేశామని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి కలెక్టరేట్‌కు రావద్దని సూచించారు

## అందుబాటులో విత్తనాలు

కుంటాల, జూన్ 1 : నిర్మల్ జిల్లా కుంటాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో జనుము 40 కేజీల బస్తా ధర రూ. 2,510, వడ్లు 25 కేజీల బస్తా రూ. 1075కి అందుబాటులో ఉన్నాయని, కావాల్సిన రైతులు నేటి నుంచి వ్యవసాయ శాఖ కార్యాలయంలో రిజిస్టర్ చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ సట్ల గజ్జారాం ఆదివారం ఒక ప్రకటనలో కోరారు.

## బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీం పథకానికి

## దరఖాస్తుల స్వీకరణ

నిర్మల్ చైన్‌గేట్, జూన్ 1 : 2025–26 సంవత్సరానికి గాను బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీం పథకానికి విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారి వీ రాజేశ్వర్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటో తరగతిలో 49 సీట్లు, ఐదో తరగతిలో 52 సీట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు ఈ నెల 16లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు ఫారం నిర్మల్ షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారి కార్యాలయం నుంచి తీసుకోవాలని తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులు ఈ నెల 16న సాయంత్రం 4 గంటల లోపు సమర్పించాలని పేర్కొన్నారు.

## ముగిసిన జొన్నల కొనుగోళ్లు

తాంసి, జూన్ 1: ఆదిలాబాద్ జిల్లా తాంసిలోని సబ్ మార్కెట్ యార్డులో సహకార సొసైటీ ఆధ్వర్యంలో 40 రోజులుగా చేపట్టిన జొన్నల కొనుగోళ్లు ముగిశాయి. ఇప్పటి వరకు 2,367 మంది రైతుల వద్ద 69,978 క్వింటాళ్ల జొన్నలు కొనుగోలు చేసినట్లు మార్కెట్ ఇన్‌చార్జి సీఈవో కేశవ్ తెలిపారు. మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో కొద్దిపాటి జొన్నలు తడిసినప్పటికీ ఆరబెట్టిన తర్వాత వాటిని కొనుగోలు చేశామని పేర్కొన్నారు.

## చిరు వ్యాపారులకు న్యాయం చేయాలి

ఎదులాపురం, జూన్ 1: ఆదిలాబాద్ అంబేద్కర్ చౌక్, గాంధీ చౌక్, పంజాబ్ చౌక్, నేతాజీ చౌక్ ఇలా ప్రధాన మార్కెట్లలోని చాలా ప్రాంతాల్లో చిరువ్యాపారులపై పాలకులు జులుం ప్రదర్శిస్తున్నారని ఎంఐఎం పట్టణాధ్యక్షుడు నజీర్ మండిపడ్డారు. ఆదివారం కలెక్టరేట్ ఎదుట చిరువ్యాపారులు నిరసన వ్యక్తం చేశారు. 12 రోజులుగా చిరు వ్యాపారాలు నిరసన చేపట్టారని, కలెక్టర్, మంత్రి సీతక్క స్పందించి వారికి న్యాయం చేయాలని కోరారు.

## నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్

ఎదులాపురం, జూన్ 1: ఆదిలాబాద్ నుంచి నిర్మల్ వెళ్లిన ఆర్టీసీ బస్సులో కండక్టర్ రమణ, డ్రైవర్ గులాబ్‌కు ఓ బ్యాగ్ దొరికింది. ఆ బ్యాగ్‌ను వారు ఆదిలాబాద్ డిపోలో అప్పగించారు. వివరాలు తెలుసుకొని నిర్మల్‌కు చెందిన అక్రమ్ బేగంకు అసిస్టెంట్ మేనేజర్ రాజశేఖర్ ఆదివారం బ్యాగ్ అందజేశారు. ఆ బ్యాగ్‌లో 12 గ్రాముల బంగారం, సెల్ ఫోన్, రూ.1000 నగదు ఉన్నాయన్నారు.

## నాణ్యమైన విత్తనం - రైతన్నకు నేస్తం బుక్ అందజేత

ఎదులాపురం, జూన్ 1 : ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవసాయ శాఖ, తెలంగాణ సంయుక్త అధ్వర్యంలో నాణ్యమైన విత్తనం – రైతన్నకు నేస్తం కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం రాష్ట్రమంతటా లాంఛనంగా ప్రారంభిస్తామని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. ఈ మేరకు ఆదివారం నాణ్యమైన విత్తనం – రైతన్నకు నేస్తం బుక్ శాస్త్రవేత్త అందజేశారు.

## నేడు రైతుల సమస్యలపై ధర్నా

తాంసి, జూన్ 1: జొన్నలు కొనుగోలు చేసిన డబ్బులు వెంటనే విడుదల చేయాలని బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం సుంకిడిలో ధర్నా నిర్వహించనున్నట్లు పార్టీ మండల ప్రధాన కార్యదర్శి వెంకటరమణ తెలిపారు. ఆదివారం తాంసిలో మండల పార్టీ నాయకులతో కలిసి ధర్నాకు సంబంధించిన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కొనుగోలు చేసిన జొన్న పంట డబ్బులను వెంటనే రైతుల ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేస్తూ తలమడుగు మండలంలోని సుంకిడి అంతర్రాష్ట్ర రహదారిపై ధర్నా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. తాంసి, తలమడుగు, భీంపూర్ మండలాలకు చెందిన రైతులు పెద్దసంఖ్యలో ధర్నాలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు రత్న ప్రకాశ్, ముచ్చ రఘు, వినోద్ రెడ్డి, మహేందర్ పాల్గొన్నారు.

# ఆవుదూడను అంతమొందించిన కేసులో నిందితుడి అరెస్ట్



ఆవుదూడను చంపిన కత్తి, తాడును స్వాధీనం చేసుకున్న పోలీసులు



దూడను బతికించే ప్రయత్నం చేస్తున్న డాక్టర్ వీడియోను చూపిస్తున్న డీఎస్పీ

ఎదులాపురం, జూన్ 1 : ఆవు దూడను అంతమొందించి అటవీ జంతువుల మాసంగా విక్రయించేందుకు యత్నించిన ఘటనలో నిందితుడిని ఆదిలాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు ఆదిలాబాద్ డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ జీవన్‌రెడ్డి, జైనథ్ సీఐ డీ సాయినాథ్ వివరాలు వెల్లడించారు. జైనథ్ మండలంలోని గిమ్మ గ్రామ శివారులో శనివారం ఆవు దూడను కత్తితో పొడిచి ప్రాణాపాయ స్థితిలో ఉన్నదని సమాచారం తెలిసిన వెంటనే జైనథ్ సీఐ డీ సాయినాథ్, ఎస్ఐలు వెటర్నరీ డాక్టర్‌తో కలిసి ఘటన స్థలానికి వెళ్లారు. వెటర్నరీ డాక్టర్ కొన ఊపిరితో ఉన్న దూడను బతికించే ప్రయత్నం చేశారు. కత్తితో పొడిచిన కారణంగా కొద్దిసేపటికి ఆవు దూడ ప్రాణాలు విడిచింది. ఈ సంఘటన నందు జైనథ్ సీఐ సాయినాథ్, ఎస్ఐ గౌతమ్‌లు విచారణ చేపట్టారు. ఆవు దూడ సిరిసన్న గ్రామానికి చెందిన సాయికుమార్ దేనని ధృవీకరించగా, నిందితుడిగా గిమ్మ గ్రామానికి చెందిన రాథోడ్ సంజయ్‌పై అనుమానంతో అతడిని ఆదివారం అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. అతను నేరాన్ని ఒప్పుకున్నాడు. అతనిపై గతంలో మేకలు, గుడిలో దొంగతనం చేసిన కేసు, ఫారెస్ట్ కేసులు నమోదయ్యాయి. దూడ మాంసాన్ని అటవీ జంతువుల మాంసంగా విక్రయించాలన్న ఉద్దేశం ఉన్నట్లు పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. నిందితుడిపై జైనథ్ పోలీస్ స్టేషన్‌లో 135 నంబర్‌తో కేసు నమోదు చేశారు. ఈ కేసులో నేరస్తుడిని త్వరితగతిన అరెస్ట్ చేసిన జైనథ్ సీఐ, ఎస్ఐలను ఎస్పీ అఖిల్ మహాజన్ అభినందించారు.

## సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి

ఇచ్చోడ(సిరికొండ), జూన్ 1: సైబర్ నేరాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇచ్చోడ సీఐ రాజు అన్నారు. ఆదివారం ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలంలోని లచ్చింపూర్(కే) గ్రామంలో పోలీసులు మీ కోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రోజురోజుకు సైబర్ నేరాల పెరుగుతున్నాయని వాటిపై అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు పాటించాలని అన్నారు. అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి వ్యక్తిగత వివరాలు అడిగితే చెప్పకూడదన్నారు, సెల్‌ఫోన్ యాప్ ద్వారా ఎలాంటి లోన్స్ తీసుకోకూడదన్నారు. యువత మత్తు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరూ తమ వాహనాలను నడపాలన్నారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీసాయి, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇచ్చోడ సీఐ రాజు

## రథశాల నిర్మాణానికి భూమి పూజ

జైనథ్, జూన్ 1: ఆదిలాబాద్ జిల్లా జైనథ్‌లోని లక్ష్మీనారాయణ స్వామి ఆలయ ఆవరణలో రథశాల నిర్మాణానికి ఆదివారం నాయకులు, అధికారులు కలిసి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

## బోల్తా పడిన కంటైనర్

ఎదులాపురం, జూన్ 1 : ఆదిలాబాద్ జిల్లాలో జాతీయ రహదారిపై కంటైనర్ బోల్తా పడింది. హైదరాబాద్ నుంచి మహారాష్ట్రకు కార్ల లోడ్‌తో వెళ్తున్న కంటైనర్ మావల సమీపంలో అదుపు తప్పి సర్వీస్ రోడ్డుపై బోల్తా పడింది. వెంటనే నేషనల్ హైవే పెట్రోలింగ్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ ప్రమాదంలో కంటైనర్ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. కంటైనర్‌లోని కార్లు ధ్వంసమైనట్లు సమాచారం.

## ఐటీసీ మేనేజర్ ఇంట్లో చోరీ

ఎదులాపురం, జూన్ 1 : ఆదిలాబాద్‌లోని న్యూ హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన గందేవర్ సురేశ్ ఐటీసీ మేనేజర్ ఇంట్లో చోరీ జరిగినట్లు మావల ఎస్ఐ పీ ప్రణయ్ కుమార్ తెలిపారు. గత నెల 31వ తేదీన భైంసాలో బంధువు ఇంటికి వెళ్లారు. తిరిగి ఆదివారం ఉదయం రాగా ఇంటి తలుపులు తీసి ఉన్నాయి. తాళం పగలగొట్టి ఉంది. ఇంట్లో దాచుకున్న నాలుగు బంగారు నాణేలు, మూడు గ్రాముల బంగారు నగలు, 250 గ్రాముల వెండి, రూ.20 వేల నగదు దొంగలించారు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

## తాళం వేసిన ఇంట్లో ..

నిర్మల్ అర్బన్, జూన్ 1 : నిర్మల్‌లోని గాజుల్‌పేట్ కాలనీలోని అబ్దుల్ ఖదీర్ అనే ఇంట్లో దొంగతనం జరిగింది. శనివారం రాత్రి ఇంటికి తాళం వేసి సమీపంలోని సోదరుని ఇంట్లో నిద్రించాడు. ఇంట్లో ఎవరూ లేని విషయాన్ని గ్రహించిన దొంగలు ఇంటి తాళం పగులగొట్టి ఇంట్లో బీరువాలో ఉన్న రూ.7వేల నగదును అపహరించుకుని పోయారు. ఇంతటితో సరిపెట్టుకొని దొంగలు సమీపంలోని పెట్రోల్ బంకులో నిలిపి ఉన్న రెండు కొత్త వాహనాల నుంచి బ్యాటరీలను సైతం ఎత్తుకెళ్లారని బాధితులు తెలిపారు.

## యువకుడి అదృశ్యం

ఎదులాపురం, జూన్ 1 : ఆదిలాబాద్‌లోని సంజయ్ నగర్‌కు చెందిన కాంబ్లే సాయిప్రశాంత్ (21) అదృశ్యమైనట్లు టూటౌన్ సీఐ కరుణాకర్ రావ్ తెలిపారు. తల్లిదండ్రులు చనిపోవడంతో తన మేనమామ ఇంట్లో ఉంటున్నాడు. శనివారం ఉదయం 11 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువకుడు తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల గాలించారు. ఆచూకీ లభించకపోవడంతో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## చోరీ కేసులో ఇద్దరు అరెస్ట్

తాంసి, జూన్ 1: ఇనుప స్తంభాలు దొంగలించిన కేసులో ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ఇన్‌చార్జి ఎస్ఐ రాధిక తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలంలోని కప్పర్ల గ్రామంలోని గండ్రత్ గంగాధర్‌కు చెందిన పంట చేను ఫెన్సింగ్‌ను నూతన రోడ్డు నిర్మాణంలో భాగంగా తొలగించారు. తొలగించిన ఇనుప స్తంభాలను అదే గ్రామానికి చెందిన షిండే భూమన్న, జిల్లా కేంద్రంలోని వడ్డెర కాలనీకి చెందిన షేక్ మొబిన్ కలిసి ఆటోలో జిల్లా కేంద్రానికి అమ్మకానికి తరలించారు. బాధితుని ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

## రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలి


కుంటాల, జూన్ 1 : నిర్మల్ జిల్లా కుంటాల మండలంలోని అందకూర్– పెంచికల్‌పాడ్ నుంచి వెంకూర్ వరకు రూ.3.50 కోట్లతో పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో బీటీ రింగు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. పెంచికల్‌పాడ్ దగ్గరలోని హనుమాన్ గుడి, బ్రిడ్జి రెండు చోట్ల తారు వేయకుండా కాంట్రాక్టర్ అలాగే వదిలేశాడు. రెండు చోట్ల ప్రతి వానకాలంలో వరద ఉధృతికి రోడ్డు దెబ్బతింటుంది. ఈ ప్రాంతాల్లో తారు కాకుండా సీసీతో రోడ్డు వేయాల్సి ఉంది. రోడ్డు నిర్మాణం పూర్తయి 3 నెలలు గడిచినా ఇంత వరకు ఆ భాగాల్లో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టలేదు. రెండు చోట్ల తాత్కాలికంగా వేసిన కంకర తేలి రోడ్డు ప్రమాదకరంగా మారి వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈసారి వర్షాకాలం ముందస్తుగానే రావడంతో వరదతో ఆ రెండు చోట్ల రోడ్డు కోతకు గురయ్యే అవకాశం ఉంది. పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే చేపట్టి రోడ్డు పనులు పూర్తి చేయాలని ఇరు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై పీఆర్ ఏఈ గౌరీశ్‌ను ఫోన్‌లో సంప్రదించగా ఆ రెండు చోట్ల సీసీ వేయాల్సి ఉందని, త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు.



పాక్షికంగా వేసిన కంకర రోడ్డుపై ప్రయాణిస్తూ ఇబ్బందులు పడుతున్న ఓ వాహనదారుడు



దస్తురాబాద్ : 1996–97 పదో తరగతి విద్యార్థులు




బజార్‌హత్నూర్: గురువులతో 1998–99 బ్యాచ్ విద్యార్థులు

# అపూర్వ సమ్మేళనాలు

దస్తురాబాద్, జూన్ 1 : నిర్మల్ జిల్లా దస్తురాబాద్‌లోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 1996–97లో చదువుకున్న పదో తరగతి విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ చదువుకున్న రోజుల నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం చదువు చెప్పిన గురువులను శాలువాతో సన్మానించి జ్ఞాపికలు అందజేశారు.

బజార్‌హత్నూర్, జూన్ 1: ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1998–99 పదో తరగతి బ్యాచ్ పూర్వ పూర్వ విద్యార్థుల సమ్మేళనం తిరుమల ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఉద్యోగ, వృత్తిరీత్యా వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడ్డా వారు ఒక చోట కలిసి అనాటి మధుర జ్ఞాపకాలు నెమరువేసుకొని సందండి చేశారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు చట్ల గజ్జారాం, నారాయణ, పోతన్న, రాజేశ్వర్, రమేశ్‌ను సన్మానించారు

బోథ్, జూన్ 1: ఆదిలాబాద్ జిల్లా బోథ్‌లోని ప్రగతి విద్యా నికేతన్ ఉన్నత పాఠశాలలో 2003–04 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వారికి విద్యా బుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ కరస్పాండెంట్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



బోథ్: 2003–04 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు

## విద్యుత్ కోతలతో ప్రజల అవస్థలు

ఖానాపూర్, జూన్ 1: నిర్మల్ జిల్లా ఖానాపూర్, పెంబి, కడెం మండలాల ప్రజలు అప్రకటిత విద్యుత్ కోతలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చెప్పిన విధంగా కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మళ్లీ కరెంట్ కష్టాలు మొదలవుతాయని అన్నట్లు జరుగుతుందని మూడు మండలాల ప్రజలు, రైతులు, వ్యాపారులు గుర్తు చేసుకుంటున్నారు. ప్రభుత్వం కోతలు లేని విద్యుత్ అందిస్తామని ప్రకటించినప్పటికీ ఖానాపూర్ నియోజకవర్గంలోని ఖానాపూర్, పెంబి, కడెం మండలాల్లో మాత్రం ఎప్పుడు పడితే అప్పుడు సమయపాలన లేకుండా విద్యుత్ కోతలు విధిస్తున్నారని ప్రజలు, విద్యుత్ వినియోగదారులు మండిపడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి అనధికార కోతలు విధించకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## సర్దుబాటు ఉత్తర్వులు రద్దు చేయాలి

ఉట్నూర్, జూన్ 1 : రాష్ట్ర ప్రభుత్వం మిగులు టీచర్లను సర్దుబాటు చేయాలని ఉద్దేశంతో తీసుకొచ్చిన ఉత్తర్వులు వెంటనే రద్దు చేయాలని తెలంగాణ టీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జాదవ్ రవీందర్ డిమాండ్ చేశారు. బడిబాట తర్వాత నమోదు విద్యార్థుల సంఖ్య ఆధారంగా చేయాల్సిన ఉపాధ్యాయుల సర్దుబాటును బడిబాటకు ముందు ఎలా చేస్తారన్నారు. ఇప్పటికే ప్రాథమిక పాఠశాలలో ఒకరు, ఇద్దరు మాత్రమే ఉపాధ్యాయులు విద్యాబోధన చేస్తున్నారని పేర్కొన్నారు. తరగతికి ఒక ఉపాధ్యాయుడిని కేటాయించకుండా పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయులను సర్దుబాటు పేరుతో పంపితే విద్యార్థులకు విద్య ఎలా అందుతుందన్నారు. ఈ ప్రజా పభుత్వం బడుగు బలహీన విద్యార్థులకు విద్యను ఎలా అందిస్తుందని ప్రశ్నించారు. ఉపాధ్యాయులు ఇండ్లకు తిరుగుతూ బడులలో చేర్పించేందుకు ప్రయత్నిస్తుంటే అధికారులను ఉపాధ్యాయులను పంపేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ఈ సర్దుబాటును ఆగస్టు నెల నుంచి చేయాలన్నది తమ ఉద్దేశ్యమని పేర్కొన్నారు.